సాక్షి రంగారెడ్డి

మంగళవారం, 6, జూన్, 2023



అడిగినందుకు ఆగ్రహించి..

తన సోదరుడి కుమార్తెను ఎందుకు వేధిస్తున్నావని ప్రశ్నించినందుకు ఆగ్రహించిన యువకుడు కత్తితో పొడిచి హత్య చేశాడు. 8లో▸



నకిలీ విత్తనాల పట్టివేత

రూ.40లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన రాయికల్ టోల్ ప్లాజా సమీపంలో జరిగింది. 8లో▸



విచారణ చేపట్టండి

పేపర్ లీకేజీపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని జీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్ డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



జేసీబీతో నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

హయత్‌నగర్: మండలంలోని సాహెబ్‌నగర్‌లో సర్వే నంబర్ 71/1లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సర్కార్ భూమిని రక్షించాల్సిన రెవెన్యూ అధికారులు బినామీ పేర్లతో కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ 'ప్రభుత్వ భూమికి ఎసరు' శీర్షికన ఈనెల 3న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో సిబ్బంది 11 ఇంటి నిర్మాణాలు, 5 ప్రహరీలను కూల్చివేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు అంజనేయులు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బడంగ్‌పేట్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (కందుకూరు బాలురు) నాదర్‌గుల్ శాఖలో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయులు, అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అర్హులు కావాలని ప్రిన్సిపాల్ రఘునందన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బాటనీ జేఎల్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ జేఎల్, గణిత శాస్త్రం జేఎల్, పీజీటీ తెలుగు, పీజీటీ హిందీ, పీజీటీ ఇంగ్లిష్, గణిత శాస్త్రం పీజీటీ, భౌతిక శాస్త్రం పీజీటీ, సాంఘిక శాస్త్రం పీజీటీ ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌ల్లో పీజీ, బీఎడ్ అర్హత కలిగి ఉండాలన్నారు. జేఎల్‌కు రూ.23వేలు, టీచర్‌కు రూ.18 వేలు ప్రతీనెల అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల నాదర్‌గుల్ (నోబుల్ ఇంజినీరింగ్ కళాశాల నాదర్‌గుల్)లో గానీ, 79950 10637 నంబర్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

నగర పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: కొత్తగా ఏర్పాటైన నగర పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు వెంటనే చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి నిధులు తగ్గించిందని, ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసి ఎత్తివేయాలని చూస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో తీవ్రమైన ఎండల్లో కూడా ఉపాధి కూలీలు పని చేస్తున్నారని, పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువయ్యాయన్నారు. వైద్య కిట్లు కూడా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వెంటనే చేపట్టాలని టీపీసీసీ కార్యదర్శి ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మించడానికి గుర్తించిన ప్రదేశంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు ఈ ప్రాంత ప్రజలకు ప్రాజెక్టు నిర్మిస్తామని నమ్మించి ఓట్లు వేయించుకొన్నారని, అధికారం చేపట్టాక మరిచిపోయారన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుష్పమ్మ, ఇందిర, చంద్రకళ, వెంకటయ్య గౌడ్, శ్రీకాంత్ గౌడ్, నవీన్, శంకర్, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జూన్.. పరేషాన్

- ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరం
- ఏటా పెరుగుతున్న స్కూల్ ఫీజులు
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- భారంగా మారుతున్న పిల్లల చదువులు
- తల పట్టుకుంటున్న తల్లిదండ్రులు



ఒక్కో విద్యార్థిపై అయ్యే ఖర్చు

మొదటి విడత స్కూలు ఫీజు	రూ.10,000–25,000
పుస్తకాలు	రూ.5000–7000
రెండు జతల యూనిఫాం	రూ.2000–2,500
రెండు జతల షూస్	రూ.700–1000
ట్రాన్స్‌పోర్టు చార్జీ	రూ.1000–1,500
స్కూలు బ్యాగు	రూ.500–700
టిఫిన్ బాక్స్, బాటిల్స్	రూ.250–500
స్టేషనరీ ఖర్చులు	రూ.200–500
న్యూ అడ్మిషన్ ఫీజు (డొనేషన్)	రూ.50,000 పైనే..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణంగా జూన్.. రైతులకు చల్లని కబురు మోసుకొస్తుంది. చిరు జల్లులతో వాతావరణాన్ని ఆహ్లాదపరుస్తుంది. కానీ ఇదే నెల పిల్లలున్న తల్లిండ్రులను మాత్రం హడలెత్తిస్తోంది. నిన్న మొన్నటి వరకు వేసవి సెలవుల్లో తమ పిల్లలతో సరదాగా గడిపిన తల్లిదండ్రులు ప్రస్తుతం 'అమ్మో.. జూన్' అంటున్నారు. విద్యాసంస్థలు పునఃప్రారంభం కానుండడమే వారి ఆందోళనకు ప్రధాన కారణం. ఇప్పటికే ఇంటి అద్దెలు, గ్యాస్, ఉప్పు, పప్పు, నూనెలు, ఇతర నిత్యావసర ధరలు ఆకాశాన్నంటి.. మధ్య తరగతి ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా.. తాజాగా స్కూలు అడ్మిషన్ ఫీజులు.. డొనేషన్లు, పుస్తకాలు, యూనిఫాం, రవాణా, స్టేషనరీ ఖర్చులు మరింత భారం కాబోతున్నాయి.

ఇతర నగరాలతో పోలిస్తే అధికం

గ్రేటర్ జిల్లాల పరిధిలో ఆరు వేలకుపైగా ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వీటిలో సుమారు 20 లక్షల మంది వివిధ తరగతుల్లో చదువుతున్నట్లు అంచనా. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్ స్కూళ్లు 1,200 వరకు ఉండగా, వీటిలో అత్యధికం పూర్వ రంగారెడ్డి జిల్లా పరిధిలోనే ఉన్నాయి. పిల్లలను మంచి స్కూల్లో చదివించి, భవిష్యత్తులో మంచి స్థానంలోకి తేవాలనే ఆలోచనతో తల్లిదండ్రులు వీటిని ఎంచుకుంటున్నారు. వారిలో ఉన్న ఈ బలహీనతను ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఇతర నగరాల్లోని సీబీఎస్‌ఈ స్కూళ్లలో సగటు వార్షిక ఫీజుతో పోలిస్తే గ్రేటర్ జిల్లాల్లోనే అధికంగా ఉన్నాయి. చెన్నైలో రూ.40 వేలు ఉంటే, బెంగళూరులో రూ.40 నుంచి రూ.90 వేల వరకు ఉంది. న్యూఢిల్లీలో రూ.60 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఉండగా ఇక్కడ పలు ప్రముఖ సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పాఠశాలల్లో రూ.లక్ష నుంచి రూ.4.50 లక్షల వరకు వసూలు చేస్తుండడం గమనార్హం. నిజానికి ఇతర నగరాలతో పోలిస్తే మన దగ్గర పాఠశాల భవనాల అద్దెలు కూడా తక్కువే. బోధన, బోధనేతర సిబ్బంది జీతభత్యాలు కూడా అంతంతే. ఈ లెక్కన విద్యార్థుల ట్యూషన్ ఫీజులు తక్కువగా ఉండాల్సింది పోయి అధికంగా ఉండడం విశేషం.

అటకెక్కిన తిరుపతిరావు కమిటీ సిఫార్సులు

ప్రైవేటు పాఠశాలల్లో అడ్డగోలు ఫీజుల పెంపుపై ప్రభుత్వం 2016లో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో ఓ కమిటీ వేసింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యాబోధన ఆధారంగా ఆయా పాఠశాలలను ఏ,బీ,సీ గ్రేడ్లుగా విభజించి, 2017లో కమిటీ నివేదికను సమర్పించింది. పెరుగుతున్న నిర్వహణ ఖర్చుల మేరకు ఏటా ఐదు నుంచి పది శాతం ఫీజు పెంచుకోవచ్చని సూచించింది. కార్పొరేట్ యాజమాన్యాలకు ఇది మింగుడుపడలేదు. కోర్టును ఆశ్రయించి కమిటీ సూచనల అమలు ఆదేశాలను నిలుపుదల చేయించి వసూళ్లకు పాల్పడుతున్నారు.

వ్యాపార కేంద్రాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ స్కూలైనా ఐదు శాతం కంటే మించి లాభాలు పొందడానికి వీల్లేదు. గుర్తింపునకు దరఖాస్తు చేసే సమయంలోనే ఎలాంటి లాభాపేక్ష లేకుండా, సామాజిక సేవే లక్ష్యంగా స్కూళ్లను స్థాపిస్తున్నట్లు అఫిడవిట్ సమర్పిస్తాయి. వాస్తవానికి మాత్రం వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయి. ఫీజులు పెంచాలంటే జీఓ నంబర్ 42 ప్రకారం జిల్లా ఫీజుల క్రమబద్ధీకరణ కమిటీ అనుమతి తీసుకోవాలి. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వసూళ్లకు పాల్పడుతున్నారు.

– మాసారం ప్రేమ్‌కుమార్, అధ్యక్షుడు, సీజేఎస్

ఆలోచిస్తేనే దడ

మావారు ఓ ప్రైవేటు ఉద్యోగి. నెలకు రూ.25 వేలు జీతం వస్తుంది. మాకు ఇద్దరు పిల్లలు. సాధారణ బడ్జెట్ స్కూల్లో చదివిస్తున్నాం. ఇంటి అద్దె రూ.8 వేలు. నిత్యావసరాలకు రూ.5 నుంచి రూ.6 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే రోజువారి ఖర్చులతో సతమతమవుతున్నాం. స్కూళ్లు పునఃప్రారంభం కాబోతున్నాయి. పుస్తకాలు, బ్యాగులు, డ్రెస్సులు, స్టేషనరీ ఖర్చులు, ఫీజుల గురించి ఆలోచిస్తేనే నిద్రపట్టడం లేదు.

– సంధ్య, పేరెంట్



సభలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

కోతలు పోయి వెలుగులు

- ఆటంకాలు లేకుండా కరెంట్ సప్లై
- రైతులకు ఉచిత విద్యుత్
- పరిశ్రమలకు 24 గంటల పాటు సరఫరా
- తెలంగాణ వచ్చాక అద్భుత ఫలితాలు
- విద్యుత్ ప్రగతి సభలో మంత్రి సబితారెడ్డి

కందుకూరు: దేశంలో రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు పరిశ్రమలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం ఒక్క తెలంగాణేనని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కందుకూరులోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో విద్యుత్ ప్రగతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014 సంవత్సరానికి ముందు ఇప్పటికీ పోల్చితే సీఎం కేసీఆర్ సారథ్యంలో విద్యుత్ శాఖ ఎలాంటి అద్భుతాలు సాధించిందో తెలుస్తుందన్నారు. ఇదంతా కేసీఆర్, అధికారుల శ్రమతోనే సాధ్యమైందని కొనియాడారు. గతంలో కరెంట్ కోతలతో వ్యవసాయం కుంటుపడి రైతులు, కూలీలు అవస్థలు పడేవారని, పరిశ్రమలు సైతం మూతపడి కార్మికులు రోడ్డున పడేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికే రూ.32 వేల కోట్లు ఖర్చు చేస్తే, రంగారెడ్డి జిల్లాలో రూ.2,500 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కింద ఏడాదికి రూ.10,500 ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ గృహాలకు వంద యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, సెలూన్లు, లాండ్రీ షాపులకు 250 యూనిట్లలోపు ఉంటే ఉచిత కరెంట్ ఇస్తున్నామన్నారు. తెలంగాణకు ముందు ఒక్కో వ్యక్తి తలసరి ఆదాయం రూ.1.12 లక్షలు ఉంటే ప్రస్తుతం రూ.3.15 లక్షలకు చేరిందన్నారు. ఇదంతా కేసీఆర్ పటిష్ట నాయకత్వం, విజన్‌తో పని చేస్తేనే సాధ్యమైందన్నారు. కాగా మంత్రి రాక ముందు కార్యక్రమాన్ని ప్రారంభించే సమయంలో ప్రొటోకాల్ ప్రకారం అధికారులు ముందుగా ఎంపీపీ మంద జ్యోతిని ఆహ్వానించకపోవడంతో ఆమె అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో విద్యుత్ సీజీఎం పి.ఆనంద్, ఆర్డీఓ సూరజ్‌కుమార్, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మహేశ్వరం ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీలు శమంత, సునీత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మదన్‌మోహన్, బడంగ్‌పేట, జల్‌పల్లి వైస్ చైర్మన్లు ఇబ్రహీంశేఖర్, యూసుఫ్‌పటేల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, విద్యుత్ ట్రాన్స్‌కో ఎస్‌ఈ లక్ష్మణ్, డీఈలు రాజారాంరెడ్డి, సురేష్‌కుమార్, ఏడీఈలు కేవీన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు అర్జీలు సమర్పించారు. ఒక్క రోజునే 204 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ.. శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు స్పందించాలని, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

కమిషనరేట్ దాటాల్సిందే

మూడేళ్ల సర్వీస్ నిండినవారికి స్థానచలనం తప్పదు

- ఎన్నికల బదిలీలకు నగర పోలీసు విభాగం కసరత్తు
- తాజాగా మార్గదర్శకాలు జారీ చేసిన ఎన్నికల సంఘం
- ఇన్‌స్పెక్టర్లకు కమిషనరేట్, ఎస్సైలకు జోన్లే యూనిట్



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్‌లో బదిలీలకు సన్నాహాలు జరుగుతున్నాయి. తాజాగా ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ఆధారంగా ముందుకు వెళ్తున్నారు. వీటి ప్రకారం గడిచిన నాలుగేళ్లలో కమిషనరేట్‌లో వరుసగా మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు బయటకు వెళ్లాల్సి ఉండగా.. జోన్‌లో ఈ కాలపరిమితి పూర్తయిన ఎస్సైలకూ స్థానచలనం తప్పదు. ఈ గడువు పూర్తి కాకున్నా.. సొంత నియోజకవర్గాల్లో పని చేస్తున్న వారికీ స్థానచలనం తప్పదు. సైబరాబాద్, రాచకొండల్లో పని చేస్తున్న అధికారులు మాత్రం పరిధి అంశంలో సేఫ్‌జోన్‌లో ఉన్నారు.

వర్తమానం పంపిన జోనల్ ఐజీ..

డీజీపీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు గత వారం సిటీ పోలీసులకు ఓ సందేశం పంపారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఉత్తర్వుల్నీ జత చేశారు. వీటి ప్రకారం 2020 జనవరి 30 నుంచి 2024 జనవరి 31 (నాలుగేళ్ల కాలం) మధ్య మూడేళ్ల పాటు కమిషనరేట్‌లో పని చేసిన ఇన్‌స్పెక్టర్లు, ఒకే జోన్‌లో విధులు నిర్వర్తించిన ఎస్సైల జాబితాలు సిద్ధం చేయాల్సి ఉంది. 2024 జనవరి ఆఖరు నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. ఈ నేపథ్యంలోనే దాన్ని కటాఫ్ డేట్‌గా తీసుకున్నారు. కేవలం కంప్యూటరైజేషన్, స్పెషల్ బ్రాంచ్, ట్రెనింగ్ విభాగాల్లో పని చేసే వారికి మాత్రమే మినహాయింపు ఉండనుంది. గతంలో ఎన్నికల సంఘం టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీలను లూప్ లైన్స్‌గా పరిగణించినప్పటికీ ఈసారి ఆ అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

ఒకే రెవెన్యూ జిల్లాలో కమిషనరేట్..

ఈ అధికారులతో పాటు స్థానిక జిల్లాలో పని చేస్తున్న, ఆరోపణలు ఎదుర్కొంటున్న, గతంలో ఎన్నికల సంఘం ఆగ్రహానికి లోనైన, కేసులు పెండింగ్‌లో ఉన్న అధికారుల వివరాలూ ఆరా తీస్తున్నారు. ఈ సమగ్ర వివరాలతో జాబితాలు రూపొందించి ఐజీ కార్యాలయానికి పంపడంతో పాటు బదిలీలకు కసరత్తు చేయనున్నారు. నిర్ణీత గడువు పూర్తి చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు కచ్చితంగా కమిషనరేట్ దాటి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సాధారణంగా ఎన్నికల బదిలీలన్నీ రెవెన్యూ జిల్లాను పరిధిగా తీసుకుని జరుగుతుంటాయి. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ మొత్తం హైదరాబాద్ రెవెన్యూ జిల్లాలో ఉండటంతో ఇక్కడ పని చేస్తున్న వారిపై ప్రభావం ఎక్కువగా ఉండనుంది. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు మేడ్చల్, యాదాద్రి, రంగారెడ్డి సహా మరికొన్ని జిల్లాల్లో పాక్షికంగా విస్తరించి ఉన్నాయి. దీంతో కమిషనరేట్‌లోనే వేరే జోన్‌లో నియమించుకునే ఆస్కారం ఏర్పడటంతో వీళ్లు 'సేఫ్‌జోన్'లో ఉన్నట్లైంది.

'కొత్త చిక్కులకు' ఆస్కారం లేకుండా..

నిబంధనల ప్రకారం నగరంలో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్లలో దాదాపు 60 శాతం మంది సిటీ విడిచి పెట్టి వెళ్లాల్సి వచ్చే ఆస్కారం ఉంది. గత ఎన్నికల సమయంలోనూ ఇలాగే భారీ స్థాయిలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు యూనిట్ బయటకు జరిగాయి. దీంతో సిటీకి చెందిన వారు బయటకు, బయటి వారు సిటీలోకి వచ్చారు. ఇలా సిటీపై పట్టులేని కొత్త వారు రావడంతో బందోబస్తు విధుల్లో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈసారి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా పోలీసు విభాగం కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ, డీఎస్పీ నుంచి అదనపు ఎస్పీ పదోన్నతులకు సన్నాహాలు జరుగుతున్నాయి. వీరిలో సిటీలో పని చేసిన అనుభవం ఉన్న వాళ్లు అవసరమైన సంఖ్యలో ఉంటారు. కొందరు వివిధ ఠాణాల్లో స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగానూ (ఎస్‌హెచ్‌ఓ) ఉన్నారు. వీరికీ మూడేళ్లు పూర్తయినా.. పదోన్నతి రావడంతో కొనసాగే ఆస్కారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో వీరిలో కొందరిని సిటీలోనే ఉంచడంతో పాటు గతంలో సిటీలో పని చేసి, ప్రస్తుతం బయటకు వెళ్లిన వారిలో అర్హులను తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

నగల కోసం ఘాతుకం

వృద్ధురాలి దారుణ హత్య

- పెళ్లికి వెళ్లొచ్చిన గంటల్లోనే విషాదం
- ప్రియుడు, ప్రియురాలే నిందితులు
- హయత్‌నగర్‌లో కలకలం



సత్యమ్మ (ఫైల్)



మృతురాలి కుటుంబ సభ్యుల రోదనలు



నిందితుడు రాకేష్



నిందితురాలు లలిత

హయత్‌నగర్/నాగోలు: ఇంట్లోని ఒంటరి వృద్ధురాలిని దుండగులు హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న నగలను దోచుకెళ్లిన ఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది. నిందితులను కొద్ది గంటల్లోనే పోలీసులు అరెస్టు చేసి.. సొమ్మును స్వాధీనపర్చుకున్నారు. సోమవారం రాత్రి ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ సాయిశ్రీ వివరాలను వెల్లడించారు. తొర్రూర్ గ్రామానికి చెందిన సంరెడ్డి సత్యమ్మ (82) ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. ఆమె పెద్ద కుమారుడు సంరెడ్డి బాల్‌రెడ్డి వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో ఉంటున్నారు. చిన్న కుమారుడు గోపాల్ రెడ్డి ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో నారాయణపేట జిల్లా దామరగిద్ద గ్రామానికి చెందిన ఎండ్ల రాకేష్ (28) ఏడాదిన్నర క్రితం హయత్‌నగర్ మండలంలోని తొర్రూర్‌కు వచ్చి తన సోదరుడు చంద్రశేఖర్ కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో ఉంటున్నాడు. మహబూబాబాద్ జిల్లా గార్ల బయ్యారానికి చెందిన గుండపాటి లలిత (34) కూలి పనుల కోసం తొర్రూర్‌కు వచ్చి సత్యమ్మ ఇంట్లోని ఓ గదిలో అద్దెకు ఉంటోంది. చంద్రశేఖర్ భవన నిర్మాణ పనులకు వచ్చే సమయంలో లలితతో రాకేష్‌కు పరిచయమైంది. వీరు వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు. వీరిద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో లలిత కోసం వచ్చే రాకేష్.. సత్యమ్మతో పరిచయం పెంచుకున్నాడు. ఆమె వద్ద బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించాడు. నెల రోజుల క్రితం సత్యమ్మ బంగారు ఆభరణాలను దొంగిలించడానికి పథకం పన్నాడు. కానీ.. వీలు కాకపోవడంతో అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.

ముఖంపై దిండు పెట్టి.. ఊపిరాడకుండా చేసి..

సత్యమ్మ పెద్ద కుమారుడు బాల్‌రెడ్డి వియ్యంకుడైన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కూతురు వివాహానికి శనివారం వెళ్లి.. ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చింది. ఆ సమయంలో ఆమె బంగారు ఆభరణాలు ధరించి ఉండటాన్ని రాకేష్ గమనించాడు. ఆమె నిద్రిస్తున్న సమయంలో దొంగతనం చేయాలని ప్లాన్ వేసుకున్నాడు. రాత్రిపూట సత్యమ్మ ఇంటి ముందు కూర్చొని ఉండగా రాకేష్ నెమ్మదిగా లోపలికి ప్రవేశించి దాక్కున్నాడు. అనంతరం వృద్ధురాలు ఇంటిలోపలికి వెళ్లి మంచం మీద నిద్రించింది. రాకేష్ తలుపులు తెరిచి లలితను ఇంట్లోకి పిలిచాడు. సత్యమ్మ ముఖంపై దిండు పెట్టాడు. కాళ్లు కదలకుండా లలిత పట్టుకుంది. ఊపిరాడకపోవడంతో సత్యమ్మ మృతి చెందింది. ఆమె దగ్గర ఉన్న రెండు వరుసల బంగారు గొలుసు, 7 బంగారు గాజులు, చేతి కడియం, ఉంగరాలు తీసుకుని నిందితులు పారిపోయారు. సోమవారం ఉదయం 10 గంటలకు వరకు సత్యమ్మ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన పక్కింటివాళ్లు ఇంట్లోకి వెళ్లి చూడగా సత్యమ్మ విగతజీవిగా పడి ఉంది. ఈ విషయాన్ని ఆమె పెద్ద కుమారుడు బాల్‌రెడ్డికి చెప్పారు. ఆయన హయత్‌నగర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని రాచకొండ పోలీసు కమిషనర్ చౌహాన్, డీసీపీ సాయిశ్రీ తదితరులు పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ల ఆధారంగా నిందితులు రాకేష్, లలితను అరెస్టు చేశారు. కేసును గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు, డీఐ నిరంజన్ పాల్గొన్నారు.



డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు



ఆభరణాలను చూపిస్తున్న డీసీపీ సాయిశ్రీ

అడిగినందుకు.. అంతమొందించాడు

షాబాద్‌షరీఫ్: తన సోదరుడి కుమార్తెను ఎందుకు వేధిస్తున్నావని అడిగినందుకు ఆగ్రహించిన యువకుడు.. సదరు యువతి బాబాయిని దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ తెలిపిన ప్రకారం .. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఖాటుకుడీ కశ్యప్(30) వలస వచ్చి మల్లాపూర్‌లోని ఫ్లైవుడ్ డోర్ల కంపెనీలో పని చేసుకుంటూ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఖాటుకుడీ ఇంట్లోనే సోదరుడి కుమార్తె ఊర్మిల కశ్యప్ ఉంటోంది. వీరి ఇంటి పక్కనే నివాసముంటున్న బీహార్ రాష్ట్రానికి చెందిన బంటి తరచూ ఊర్మిలను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10.30గంటల సమయంలో ఆమెను అసభ్యకరంగా దూషించాడు. దీంతో యువతి తన బాబాయి విషయాన్ని వివరించి విలపించింది. దీంతో ఎందుకు దూషించావని అడిగేందుకు వెళ్లిన ఖాటుకుడిపై బంటి కత్తితో దాడి చేసి ఛాతి ఎడమ భాగం, గొంతు భాగాలలో పొడిచాడు. అడ్డుకోబోయిన యువతి చేతిపైనా దాడిచేసి పరారయ్యాడు. స్థానికుల సాయంతో ఖాటుకూడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టండి

- రద్దు చేసిన గ్రూప్–1 ప్రిలిమ్స్ టాపర్స్ లిస్ట్ బయటపెట్టాలి
- టీఎస్‌పీఎస్సీ ముట్టడిలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్



టీఎస్పీఎస్సీని ఎదుట బీఎస్పీ నేతల ఆందోళన

ఇబ్రహీంపట్నం: పేపర్ లీకేజీ అంశాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకోవాలని, నూతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన తర్వాతే గ్రూప్–1, ఇతర పోటీ పరీక్షలు నిర్వహించాలనే డిమాండ్‌తో పార్టీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం టీఎస్‌పీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలో పోలీసులు బీఎస్పీ నేతలను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. రద్దు చేసిన గ్రూప్–1 ప్రిలిమ్స్ టాపర్స్ లిస్టును వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సిట్, ఈడీ విచారణ ఎదుర్కుంటున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ గ్రూప్–1 ప్రిలిమ్స్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. విచారణలో చైర్మన్ జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన 16 పరీక్షల పేపర్లు లీకై నట్లు తెలిసినా కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న చైర్మన్ నేతృత్వంలోనే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జూన్ 11న రీషెడ్యూల్ విడుదల చేయడం అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నేతలను పోలీసులు అరెస్టు చేయడం స్వేచ్ఛను హరించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పి.రాములు, ప్రహ్లాద్, మహేందర్, గణేశ్, బి.మహేందర్, కృష్ణ, మైసయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న దొంగల కదలికలు

హయత్‌నగర్: కుంట్లూర్‌లో దొంగల కదలికలు కలకలం రేపుతున్నాయి. శనివారం రాత్రి ఇష్టకామేశ్వరి ఆలయంలో హుండీ డబ్బులు దోచుకెళ్లిన దుండగులు ఆదివారం రాత్రి అదే పరిసరాలలో కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇష్టకామేశ్వరీ ఆలయానికి వెళ్లే దారిలో ముసుగులు ధరించిన దుండగులు ఓ ఇంటి గోడపై కూర్చున్నారు. గమనించిన మమత అనే మహిళ కేకలు వేసినా కదల్లేదు. పక్కింటి వారు మరో ఇంటివారు లైట్లు వేయడంతో గోడ దూకి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. రెండు రోజులుగా దొంగలు తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ పెంచి దొంగలను పట్టుకోవాలని వారు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

అత్తాపూర్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ప్రశంసలు అందుకుంటున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన అధికారులతో కలిసి అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్లుగా ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా ప్రజలు ప్రశాంత జీవనం సాగించేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. సైబరాబాద్, రాచకొండ సరిహద్దులను కలుపుతూ అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటైందని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ పోలీ స్‌స్టేషన్‌కు సమీపంలో ఒక వైపు కార్వాన్, మరోవైపు మెహదీపట్నం, బహదూర్‌పురా, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ల మధ్యలో ఉంటుందని సమస్యాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందినందున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అత్తాపూర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా నియమితులైన యాదగిరికి స్వాగతం పలుకుతూ విధుల్లో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీత, అడిషనల్ డీసీపీ రేష్మి పేరుమాల్, ఏసీపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం



మల్కాపూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కేఎస్ రత్నం

- చేవెళ్ల అసెంబ్లీ టికెట్ ఇచ్చేందుకు సీఎం సుముఖత
- 'పల్లె పల్లెకు రత్నం'లో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

చేవెళ్ల: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు బీఆర్‌ఎస్‌పై ప్రత్యేక అభిమానం ఏర్పడిందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. సోమవారం ఆయన పల్లె పల్లెకు రత్నం కార్యక్రమం ద్వారా మండల పరిధిలోని రావులపల్లి, కుమ్మెర, మల్కాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకోవటంతోపాటు ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలపై ఆరాతీస్తుంటే ప్రభుత్వంపై ప్రత్యేక అభిమానం కనిపిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్‌తో కలిసి పనిచేశానని.. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ టికెట్ తనకు కేటాయించాలని కోరానని చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. పల్లె పల్లెకు రత్నం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్లి వారిని చైతన్యం చేస్తున్నామన్నారు. టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ, చేవెళ్ల ప్రజల కోసమే పని చేస్తానన్నారు. తనకు రాజకీయ వారుసులు లేరని నా కుటుంబం నుంచి రాజకీయాల్లోకి ఎవరూ రారని ప్రజలకు వాగ్దానం చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్కాపూర్ మానిక్యరెడ్డి, శివారాజు, రాంచంద్రయ్యగౌడ్, పాండుగౌడ్, నాగరాజు, సుదర్శన్, కుమార్, రవి, నరేశ్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పనితీరు భేష్

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



పీఎస్‌ను ప్రారంభించి సీఐ నరేశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమైనదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఆయన జనవాడ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన మోకిల నూతన పోలీస్ స్టేషన్‌ను రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలీస్ శాఖ అమలు చేస్తున్న నూతన విధానాల ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా క్రైం రేటు తగ్గిపోయిందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు సత్వర న్యాయ పరిష్కారం లభిస్తోందన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం ప్రభుత్వం నూతన పోలీస్ స్టేషన్‌లను ప్రారంభిస్తుందన్నారు. మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని 14 గ్రామాలుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సాధనరష్మి పెరుమళ్, నార్సింగి ఏసీపీ రమణ గౌడ్, చేవెళ్ల ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, సీఐలు నరేశ్, శివకుమార్, సంజయ్ కుమార్, ఎస్‌ఐ కృష్ణ, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు నర్సింహ తదితరులు ఉన్నారు.

ఆ పరిశ్రమలకు అనుమతులు ఇవ్వొద్దు

- ఉపాధి హామీ పనుల్లో పర్యావరణహిత పనులు చేపట్టాలి
- తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుదాస్



తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు

కొందుర్గు: పరిశ్రమల కారణంగా పంటలపై దెబ్బ పడుతోందని.. అటువంటి పరిశ్రమలకు అనుమతులు ఇవ్వొద్దని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.ప్రభుదాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేశ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ.. ఆహార భద్రతకు, పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలకు అనుమతులు నిరాకరించాలని కోరారు. ఇప్పటికే పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో పంటలు తీవ్రంగా నష్టపోయి అన్నదాతలు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పశువులు రోగాల బారిన పడుతున్నాయని వాపోయారు. దీంతో రైతులు బ్రతుకుదెరువుకు వలస వెళ్లే దుస్థితి ఏర్పడిందన్నారు. ఉపాధిహామి పథకంలో పర్యావరహితమైన పనులను చేపట్టాలని కోరారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను నిషేదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామయ్య, నర్సయ్య, కృష్ణయ్య, గోపాల్, రామకృష్ణ, శివరాములు, రత్నయ్య, రాములమ్మ, జంగమ్మ పాల్గొన్నారు.

చిన్నారులను సర్కారు బడుల్లోనే చేర్పించండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిలు

అత్తాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో కలిసి అత్తాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తుస్తూ ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని వారికి కావాల్సిన నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి ఖర్చు లేకుండా విద్యార్థులు నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయిప్రసాద్‌రావు, రజియాబేగం, సరళ, మీనాకుమారి, రోజారాణి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ విత్తనాల పట్టివేత

- 31 బస్తాల్లో రూ.40లక్షల విలువైన పత్తి సీడ్స్ సీజ్
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



పోలీసులు సీజ్ చేసిన విత్తనాలు, అదుపులో నిందితుడు రంగారావు

షాద్‌నగర్‌రూరల్: రూ.40లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్ ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ అధికారులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలుకు చెందిన తోటకూర రంగారావు నకిలీ విత్తనాలు జిల్లా పరిధిలోని పరిగిలో విక్రయించేందుకు 31 బస్తాల్లో తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న వ్యవసాయ శాఖ అధికారులు పోలీసు శాఖ సహకారంతో సంయుక్తంగా దాడి చేశారు. పత్తి విత్తనాలను సీజ్ చేసి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. కాగా నిందితుడు గతంలోనూ ఆదిలాబాద్ పరిసర ప్రాంతాలలో నకిలీ విత్తనాలు విక్రయించిన కేసులో జైలుకు వెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. దాడులు చేసిన వారిలో ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఏఓ నిషాంత్‌కుమార్, ఏఈఓ తేజ్‌కుమార్ పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం

శంకర్‌పల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్‌పల్లికి చెందిన జొన్నాడ బాల్‌రాజ్‌గౌడ్(36) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఆయన పొలం వద్దకు వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, కూతుళ్లు మానస, పూజిత, కుమారుడు సాయి కుమార్ సంతానం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసన్న కుమార్ తెలిపారు.

కారు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్: కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సిద్ధంతి ఫ్లైఓవర్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్న (40) వ్యక్తిని హైదరాబాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వైపు వెళుతున్న కారు ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

శంషాబాద్: సామాజిక సేవకులు, వ్యాపార వేత్త కందకట్ల సిద్దురెడ్డి సోమవారం పట్టణంలో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. సంగీత మొబైల్స్ సమీపంలోని మైదానంలో మాంసాహార, శాఖా హార వంటకాలతో అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ సిద్దురెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గత 40 రోజులుగా ప్రజలకు మజ్జిగతో పాటు మంచినీళ్ల పంపిణీ చేసి దాహార్తిని తీర్చారన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా అన్నదానానికి వచ్చిన వారికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సినీనటుడు ఇంద్రసేన, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బండ్లగూడ: ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాదాన్ కళాశాల ఆవరణలో పెండింగ్ చలాన్లపై సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అనంతరం సీఐ కృష్ణ మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.



దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115